# ఎత్తుకు పై ఎత్తు

గోల్కొండ ఎక్స్‌ప్రెస్ పొగలు కక్కుకుంటూ వొచ్చి స్టేషన్‌లో ఆగింది.

ఆ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రెండు నిముషాల కంటే ఎక్కువసేపు ఆగదు. ఆదరా బాదరాగా ఫస్టుక్లాసులోకి ఎక్కాడు విశ్వనాథం.

ఇద్దరు వ్యక్తులు ఎదురెదురు బర్తులమీద కూర్చుని వున్నారు. ఇద్దరూ విశ్వనాథంకేసి చూసీ ఛూడనట్టే వుండిపోయారు. అతని చేతిలోవున్న సూట్‌కేసును పై బర్త్‌మీద పెట్టాలని చెయ్యి పైకెత్తాడు. అప్పటికే ఆ బర్త్‌మీద ఒకేలా వున్న రెండు లెదర్ సూట్‌కేసులు వున్నాయి. విశ్వనాథంకేసి ఆ ఇద్దరు వ్యక్తులూ చిరాగ్గా చూశారు. అది గమనించి విశ్వనాథం తన చేతిలోని పెట్టెను ఎదురు బర్త్‌మీద పెట్టాడు. బర్త్‌మీద కూర్చున్నాడు. వాళ్ళిద్దరూ చాలా గంభీరంగా వుండటాన్ని గమనించాడు.

"కాస్తకూ కూస్తకూ ముఖం చిట్లించుకొనేవాళ్ళన్నా, ముఖం ముడుచుకొని కూర్చునే వాళ్ళన్నా విశ్వనాథానికి అరికాలుమంట నెత్తికి ఎక్కుతుంది. అలాంటివాళ్ళతో ప్రయాణం చెయ్యడమంటే మరీ చిరాకు.

చాలామంది రైలు పెట్టెలూ, బస్సులూ ఎక్కి కూర్చుని స్వంత ఇల్లుగా భావిస్తారు. ఇళ్ళల్లో ఎలా తగలడ్డా బయటికి వచ్చాక సర్దుబాటుతనం వుండాలి. రైళ్ళలో ప్రయాణం చేసేవాళ్ళ మనస్తత్వం తమాషాగా వుంటుంది. ముందు పెట్టెలోకి ఎక్కగానే అంతకుముందునుంచీ అందులో కూర్చున్నవాళ్ళు (ముఖ్యంగా సెకండ్ క్లాసులో) ఆ వచ్చిన వాడెవడో తమ స్వంత ఇంటిని ఆక్రమించు కోవడానికి వచ్చినట్టే చూస్తారు. కొత్తగా ఎక్కినవాడికి ఆ రైల్లో ప్రయాణంచేసే అధికారమే లేనట్టు భావిస్తారు. ఆ వచ్చినవాడు కూడా అలాగే ఒదిగి ఒదిగి (సెకండు క్లాసులో అయితే నిల్చుంటాడు) కూర్చుంటాడు. బండి కదిలాక అందరూ సర్దుకు కూర్చుంటారు. ఆ తర్వాత ఏ వూరు మనది – తో ప్రారంభించి మీ పెద్దమ్మాయికి కట్నం ఎంత ఇచ్చారు — అనేదాక సంభాషణ సాగుతుంది. కాని కొంతమంది 'నన్ను ముట్టుకు నామాల కాకి' అన్నట్టు కూర్చుంటారు.

ఈ ప్రపంచంతోనే సంబంధం లేనట్టుగా కూర్చున్న తోటి ప్రయాణికులిద్దరికీ విశ్వనాథం ఎక్కడం కొంచెం ఇబ్బంది కలిగించినట్టు ముఖాలు చెబుతున్నాయి.

ఇద్దరూ విశ్వనాథంకేసి చురుగ్గా ఓసారి చూసి ఒకరి నొకరు ఓరగా చూసుకొన్నారు. ఆ చూపులూ, వాళ్ళూ— విశ్వనాథానికి ఎలాగో వుంది.

విశ్వనాథం కూర్చున్న బర్త్‌మీద కూర్చున్న వ్యక్తి కొంచెం బొద్దుగా, దృఢంగా, చామనచాయగా వున్నాడు. నల్లటి నొక్కుల జుట్టూ, సూదుల్లాంటి వాడి చూపులూ, ఎత్తైన నొసలూ, నల్లటి గుబురు కనుబొమలూ—అతన్ని చూస్తుంటే విశ్వనాథానికి సినిమాల్లోని 'విలన్' గుర్తొచ్చాడు. నల్ల గీరల పేంటూ, తెల్లటి బుష్‌కోటూ వేసుకొని వున్నాడు.

విశ్వనాథం కళ్ళు ఎదురు బర్త్‌మీద కూర్చున్న వ్యక్తిమీద నిల్చాయి. అతను కొంచెం సన్నగా, ఎర్రగా, పొడవుగా వున్నాడు. విశాలమైన నొసలూ, పెద్ద కళ్ళూ వాడి ముక్కూ—ఆ ముక్కుమీద నల్ల కళ్ళద్దాలూ ఉన్నాయి. తెల్లని షర్టూ, తెల్లటి ప్యాంటూ వేసుకొని మెరూన్ కలర్ టై కట్టుకొని వున్నాడు. అద్దం కిందగా వేలాడుతున్న నల్లటి కోటు అతనిదే అయివుంటుంది అనుకున్నాడు విశ్వనాథం. అతనికి వయసు ముప్పయ్, ముప్పయ్‌అయిదు వుండొచ్చు! విశ్వనాథం పక్కన కూర్చున్న వ్యక్తి ఇతనికంటే పెద్దవాడిలా కన్పిస్తున్నాడు.

ఎక్స్‌ప్రెస్ వేగాన్ని పుంజుకుంది. క్రింద పట్టాల రొద. పక్కనించి గాలి హోరు. చెవుల గింగురు మంటున్నాయి. వాళ్ళిద్దరికీ ఇదేం పట్టినట్టు విశ్వనాథానికి అనిపించలేదు.

విశ్వనాథానికి వాళ్ళ వాలకం చూస్తుంటే చిరాకు వేసింది. బాగా పరిచయమున్న ఇద్దరు వ్యక్తులు మాటలు ముదిరి తన్నుకొనేదాకా వచ్చినట్టు అలా కూర్చున్నారేం ? కదిలిస్తే పగిలే బెలూన్సులా వున్నారు. అగ్నిపర్వతాల్లా వున్నారు. మధ్య మధ్య ఎందుకలా సూట్‌కేసులవైపు చూస్తారూ ?

వాళ్ళ వాలకం చూస్తున్నకొద్దీ విశ్వనాథానికి ఏదో అనుమానంగా వుంది. అయోమయంగా వుంది. తన పక్కన కూర్చునివున్న వ్యక్తిని పలకరించాలని చాలాసార్లు ప్రయత్నించాడు ! అతను విశ్వనాథంవంక చూస్తూ, పలకరించబోయేసరికి ముఖం తిప్పుకుంటున్నాడు. అది చూస్తున్నకొద్దీ అతన్ని ఏమైనా సరే పలకరించాలనే కోర్కె విశ్వనాథంలో బలపడింది.

ఓ అరగంట తర్వాత ఏదో సర్దుకుంటున్నట్టు అటూ ఇటూ కదిలి, కాలితో తన్ని అతడు చూడగానే ' సారీ ! ' అన్నాడు. అతను పలకలేదు.

" ఏ ఊరు వెళ్తున్నారు ? "

"బెజవాడ!" ముక్తసరిగా జవాబిచ్చాడు.

మరో మాట అడగాలనుకొనేసరికి ఎదురు బర్తుమీద కూర్చున్నవాడు తనకేసి చూడటాన్ని గమనించి "మీరు ఏ ఊరు పోవాలి?" అన్నాడు విశ్వనాథం.

"విజయవాడే!" సమాధానం చెబుతూనే ముఖం కిటికీవైపుకు తిప్పుకున్నాడు.

అంతలోనే స్టేషన్‌లో బండి ఆగింది. పేపర్లమ్మే కుర్రాడి కేక వినబడింది. కుర్రాడ్ని పిలిచి పేపరు కొన్నాడు విశ్వనాథం.

బండి స్టేషన్ వదిలింది.

అవుటర్ సిగ్నల్ దాటి వేగంగా పోతోంది.

మళ్ళీ గాలి హోరూ! పట్టాల రొద!

తోటి ప్రయాణీకు లిద్దరూ, తమ పక్కనవున్న కిటికీల అద్దాలను దించారు.

విశ్వనాథం పేపరు తిరగేస్తూ కూర్చున్నాడు. మూడో పేజీలో తాటికాయంత అక్షరాల్లోవున్న శీర్షిక మీద అతని కళ్ళు నిల్చాయి. అలాంటి వార్తలు తోటి ప్రయాణీకుల్ని సంభాషణలోకి దించడానికి పనికొస్తాయి.

'నేషనల్ బ్యాంక్ దోపిడి! ఒక లక్ష ఏభై వేల రూపాయల కరెన్సీతో దుండగుల పరారీ! రాష్ట్రవ్యాపితంగా పోలీసుల గాలింపు.

దోపిడీదారుల ఆచూకీ తెలిపినవారికి పది వేల రూపాయల బహుమతి.

ఆ శీర్షిక కిందవున్న రెండు కాలమ్స్ దోపిడీ తాలూకు వివరాలతో వున్నాయ్. పూర్తిగా చదివేదాకా విశ్వనాథం మనసు వుండబట్టలేదు. ఆత్రంగా పేపరు తన పక్కన కూర్చొనివున్న "విలన్"కు చూపిస్తూ అన్నాడు—

"ఈ వార్త చూశారా ?"

"ఏ వార్త ?" అంటూ ఒక్కసారిగా అతను పేపరు విశ్వనాథం చేతిలోనుంచి గుంజుకున్నాడు.

ఎందుకు అంతగా తృళ్ళిపడ్డాడు చెప్పకుండా తుపాకి పేల్చినట్టు ?

విశ్వనాథం అతన్ని పరిశీలనగా చూశాడు. అది గమనించి అతను పేపరు ముఖానికి అడ్డం పెట్టుకున్నాడు. కొద్దిక్షణాల తర్వాత ఆ వార్త బిగ్గరగా చదివాడు. చదువుతూనే మనిషి తేలిగ్గా నిట్టూర్చడాన్ని గమనించాడు విశ్వనాథం.

ఉత్సాహంగా దోపిడీ వివరాల్ని చదువుతున్న అతన్ని కుతూహలంగా చూడసాగాడు విశ్వనాథం.

అతని వాలకం అర్థంకాక విశ్వనాథం ఎదురుగా కూర్చున్న కళ్ళజోడు వ్యక్తికేసి చూశాడు. కాని అతని

ముఖం కన్పించలేదు. కిటికీలోనుంచి బయటికి దీక్షగా చూస్తున్నాడు.

" దేశంలో అరాజకం ఎక్కువై పోతోంది " పేపరు మడిచి పక్కన పెడ్తూ అన్నాడు బుష్‌కోటాయన.

విశ్వనాథం " నిజమే ! " అన్నట్టు తల ఆడించాడు.

" ఇటువంటి వాళ్ళకు మామూలు శిక్షలు వెయ్యకూడదు. కనబడ్డ వాళ్ళను కనపడ్డట్టు కాల్చి పారెయ్యాలి " సీరియస్‌గా ముఖంపెట్టి మళ్ళీ అన్నాడు.

' కాదు ! వాళ్ళను ప్రాణాల్తో పట్టుకొని చిత్రవధ చెయ్యాలి ! ' ఎదురుగా కూర్చున్న కళ్ళజోడు వ్యక్తి సర్రున వెనక్కు తిరిగి అన్నాడు. అలా అంటున్నప్పుడు అతని చేతులమీది రోమాలు నిక్కపొడిచాయి. మెడ పక్కన కణతలమీద నరాలు ఉబికాయి.

' ఈ నెలలో ఇది ఐదో దోపిడి ! ' నల్ల కళ్ళ అద్దాల తాలూకు వ్యక్తి, కళ్ళజోడు సర్దుకుంటూ అన్నాడు.

" పోలీస్ శాఖ చేతగానితనం ! " బుష్‌కోట్ పెదవి విరిచింది.

' ప్రజల్లో మందగొండితనం పెరిగిపోతోంది! అశ్రద్ధ పోలీసు శాఖను నిందించడంలో అర్థంలేదు ' కళ్ళజోడు లేచివచ్చి విశ్వనాథం రెండో పక్కన కూర్చుంది.

'ప్రజలే దొంగల్ని పడితే పోలీసు లెందుకూ ?' బుష్‌కోటు సిగరెట్ వెలిగించుకుంటూ అన్నది.

"పోలీసు డిపార్ట్‌మెంటులో వున్న వాళ్ళంతా శుద్ధ మొద్దులు ! ఇడియట్స్ !" మాట్టాడటానికి ఏమీ తోచక అన్నాడు విశ్వనాథం. మరుక్షణం తన మాటలు తనకే ఫూలిష్‌గా తోచాయి.

బుష్‌కోటూ, కళ్ళజోడూ విశ్వనాథాన్ని అదోలా చూశాయి. ఆ సంభాషణలో తలా తోకా తెలియని విశ్వనాథం ఆలోచించకుండా ఏదో అనేశాడు.

వీళ్ళ వాలకం చూస్తుంటే వీళ్ళకు ఇంతకుముందే ఈ దోపిడీ గురించి తెలిసినట్టుంది. వీళ్ళకు ఈ దోపిడీతో సంబంధం వుందేమో ?

ఆలోచిస్తున్న విశ్వనాథానికి అమాంతం డిటెక్టివ్‌గా మారిపోవాలనిపించింది.

"పోలీస్ శాఖలో కొంతమంది ఇడియట్స్ వున్న మాట నిజమే అనుకోండి అంతమాత్రంచేత ఆ శాఖలో వున్న వాళ్ళంతా తెలివితక్కువ దద్దమ్మలే అనుకోవడం శుద్ధ పొరపాటు !" నొక్కి నొక్కి పలుకుతూ కళ్ళ అద్దాలలోనుంచి పరిశీలనగా చూశాడు విశ్వనాథంకేసి.

విశ్వనాథానికి లోతు తెలియని అగాధంలోకి ఒక్కొక్క మెట్టే దిగిపోతున్నట్టు అనిపించింది.

ఎవరు వీళ్ళు ?

నల్ల కళ్ళద్దాలవాడు ఇంటలిజెన్స్ బ్రాంచీ ఉద్యోగి కాదు కదా ? అయితే మరి ఆ రెండోవాడు ?

విశ్వనాథంలోని డిటెక్టివ్ స్పిరిట్ పైకి లేచింది. కాదు.... ఇందులో ఒకడు దొంగ అయివుంటాడు. ఆ దొంగగాడు ఒకసారి కళ్ళజోడు వ్యక్తిలో కన్పిస్తే, మరోసారి బుష్షర్టులో కన్పించినట్టే కన్పించి ఇట్టే మాయమై పోతున్నాడు. ఏది ఏమైనా వాళ్లిద్దరిలో ఒకడికి ఈ దోపిడీతో సంబంధం వున్నట్టు విశ్వనాథానికి అన్పించింది.

"ఈ రోజుల్లో దొంగతనాల టెక్నిక్ పెరిగిపోయింది."

కళ్ళజోడు వ్యక్తి విశ్వనాథంమీదుగా వంగి, అతనికి రెండోవైపు కూర్చునివున్న బుష్షర్టు వ్యక్తి చేతిలోనుంచి పేపరు తీసుకుంటూ అన్నాడు.

'దొంగతనం చేసేవాళ్ళకు వున్న తెలివితేటలు పట్టుకొనే వాళ్ళకు లేవు' ఠక్కున అనేసి నాలుక కరచు కున్నాడు విశ్వనాథం.

ఇద్దరూ చివ్వన తలలు తిప్పి విశ్వనాథంకేసి చూడసాగారు.

'ఇలాంటి దోపిడీలు బాగా చదువుకున్న వాళ్ళే చేస్తున్నారు' కళ్ళజోడు అన్నది.

'వాళ్ళు కూడా సూటూ బూటూ వేయడం....'

'ఘరానా పెద్దమనుషుల్లా మాట్లాడటం.'

"ఫస్టుక్లాసులో ప్రయాణం చేయడం."

వాళ్ళ సంభాషణ వింటుంటే విశ్వనాథానికి తల క్రెడిల్‌లో పెట్టి నొక్కినట్టుగా వుంది. ముచ్చెమటలు పట్టసాగాయి. వాళ్ల సంభాషణ ఏ మలుపు తిరుగుతుందో తెలియకుండా వుంది.

వాళ్లిద్దరూ విశ్వనాథానికి చెరొక వైపునా దగ్గరకు జరిగి కూర్చున్నారు.

'డిటెక్టివ్‌లా కూపీలు తియ్యడమూ....'

'దోపిడీచేసి వచ్చినవాడే ముందు దోపిడీ గురించి మాట్లాడటమూ....'

ఆపై మాటల్ని విశ్వనాథం మెదడు గ్రహించే స్థితిలో లేదు.

ఎక్స్‌ప్రెస్ అతనికి తన గుండెలమీదినుంచే పోతున్నట్టు అనిపించసాగింది.

వాళ్లు అంటూన్న ప్రతి మాటలోనూ, చూస్తున్న ప్రతి చూపులోనూ, తనను అనుమానిస్తున్నట్టూ, తన గురించే మాట్లాడుతున్నట్టూ అనిపించసాగింది విశ్వనాథానికి.

వీళ్ళు తప్పకుండా పోలీసు డిపార్టుమెంట్‌కి సంబంధించినవాళ్లే అయివుండాలి. కర్మం కాలి తనను దొంగగా చిత్రించరు గదా! లక్షా ఏభయ్‌వేల దొమ్మీ కేసులో ఇరికించేస్తే? అయ్యబాబోయ్!

'ఈ రోజుల్లో దొంగలు ఉచ్చులో పడ్డాక కూడా ప్రయత్నం మానరు' మాటలు విన్పించాయి. కాని ఆ మాటలు అన్నది ఆ ఇద్దర్లో ఎవరో తెలుసుకొనే మానసిక స్థితిలో లేడు విశ్వనాథం.

విశ్వనాథానికి గుండెకాయ పైకి ఎగబాకి గొంతులోకి వచ్చినట్లు అయింది. తల తిరిగిపోతున్నది.

తను పోలీసువాళ్ల చేతిలో పడ్డాడు. ఒక్కసారి వాళ్ల చేతిలో పడ్డాక చెయ్యని తప్పును కూడా ఒప్పుకొని జైల్లో పడక తప్పదంటారు.

బ్యాంకి దోపిడీ రహస్యాలు చెప్పమని చిత్రహింస చేస్తారు కాబోలు. తనేం చెబుతాడు? అసలు తనకు ఆ వివరాలు తెలిసివుంటే గదా చెప్పడానికి? అంతా ఏమిటో అయోమయంగా వుంది. మతి పోతోంది. తన దగ్గర లక్షా యాభైవేల రూపాయల మాట అటుంచి చిల్ల పెంకులు కూడా లేవే! పైగా ఉద్యోగం కూడా పోతుంది.

అంత అయోమయంలోనూ సంభాషణ మరోవైపుకు తిప్పడానికి ప్రయత్నించాడు విశ్వనాథం.

"ఏమండీ! ఆ సూట్‌కేసు ఎక్కడ కొన్నారూ? చాలా బాగుంది" ఎదురుగావున్న పై బెర్తు మీద సూట్‌కేసుల్ని చూస్తూ అన్నాడు విశ్వనాథం.

ఆ మాట వింటూనే వాళ్ళిద్దరి ముఖాలూ మారిపోయాయి. విశ్వనాథానికి వాళ్ళ ముఖాలు చూస్తూంటే భయం వేసింది. తను వెర్రిగా మాట్లాడాడా? తప్పుగా మాట్లాడాడా? మరి వాళ్ళ ముఖాలు అలా మారిపోయాయేం?

కళ్ళజోడు వ్యక్తి ఠక్కున లేచాడు. సూట్‌కేసుల్లో ఒకదాన్ని అందుకొని పక్కన పెట్టుకొని కూర్చున్నాడు. బుష్‌కోటు వేసుకున్న అతను వెంటనే లేచివెళ్ళి ఎదురు బెర్త్ మీద కూర్చున్నాడు. ఇద్దరూ ఒకరికేసి ఒకరు అదోలా చూసుకున్నారు. విశ్వనాథానికి చెమట్లు పట్టాయి.

ఆ రెండు సూట్‌కేసులూ ఒకటిగానే వున్నాయి. ఇద్దరి ముఖాల్లో కదిలే నీడలూ దాదాపు ఒకటిగానే వున్నాయి. ఇద్దరూ కళ్ళతోనే మాట్లాడుకొని రివాల్వర్లు తీస్తారేమో? సందేహం లేదు! వీళ్లు పోలీసువాళ్లే! తనను అనుమానిస్తున్నారు.

ముగ్గురూ త్రిభుజాకారంలో కూర్చున్నారు. విశ్వనాథానికి అనుమానం రేఖలుగానూ, భయం కోణాలు గానూ, తన పక్కన కూర్చున్న వ్యక్తి భూమిగానూ ఎదురుగా కూర్చున్న వ్యక్తి భుజంగానూ, తను లంబంగా,

ఆ త్రిభుజంలో వున్నట్టుగా అన్పించింది. ఒకరికి తెలియకుండా మరొకర్ని గమనించడానికి ముగ్గురూ ప్రయత్నిస్తున్నారు.

అట్లా అనుమానంతో చూడకపోతే తనను పట్టుకో వచ్చుగా! ఆ చూపులు మరీ దారుణంగా తనను చిత్రహింస చేస్తున్నాయి.

రైలు, పట్టాలు తప్పి పడిపోతున్నట్టు అన్పిస్తుంది. మతి చెలించి పోతోంది. గుండెలో దడ, శరీరంలో వణుకు, రక్తంలో చల్లదనం....

ఈ వుచ్చులోనుంచి తను బయట పడాలి! ఎలా? ఎలా?

కిటికీలోనుంచి బయటకు దూకితే!

గొలుసులాగి బండి ఆపితే....

"నేనే దోపిడీ చేసింది. నేనే దొంగను! పట్టుకోండి. ఆ పెట్టెలో వున్నయ్ లక్షా యాభై వేలు! తీసుకోండి! ఆ మధ్య జరిగిన పసివాడి హత్య కూడా నేనే చేశాను. పట్టుకోండి." అని వెర్రిగా అరవాలనిపించింది విశ్వనాథానికి

రెండు చేతులతో జుట్టు పీక్కుంటూ లేచి నిల్చున్నాడు అతను నిలబడీ నిలబడకముందే ఆ ఇద్దరు వ్యక్తులూ వెళ్ళి చెరోవైపు తలుపు దగ్గర నిల్చున్నారు.

విశ్వనాథం పై ప్రాణాలు పైనే పోయినయ్.

సీటులో కూలబడ్డాడు.

తల బరువుగా వుంది.

గుండెలు విచ్చిపోతున్నయ్.

వెనక్కు వాలి కళ్ళుమూసుకుని కూర్చున్నాడు.

పీడ కల చూస్తున్నవాడిలా వున్నాడు.

విశ్వనాథం కూర్చోగానే ఆ ఇద్దరూ తిరిగివచ్చి తమ తమ సీట్లలో కూర్చున్నారు.

ముగ్గురూ మౌనంగా కూర్చున్నారు. టైం బాంబు ఏదో పేలబోతున్న ఆచూకీ తెలిసిన వాళ్ళలా కూర్చున్నారు.

కృష్ణానది దాటి ఎక్స్‌ప్రెస్ విజయవాడ స్టేషన్‌లోకి వస్తోంది. బుష్‌కోటు వ్యక్తి స్టేషన్‌కు రెండోవైపున వున్న డోర్ దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. కళ్ళజోడు అతన్నే గమనిస్తున్నాడు. విశ్వనాథం ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తున్నాడు బండి ఆగుతుండగానే బుష్‌కోటు వ్యక్తి అదరా బాదరాగా దిగే ప్రయత్నంలో వున్నాడు. తన సూట్‌కేసు కూడా మర్చిపోయాడు.

'ఏమండోయ్ ! సూట్‌కేసు మర్చిపోయి వెళ్తున్నారు!'

బుష్‌కోటు ముఖం తెలతెలాపోయింది. కళ్ళజోడు అతనికి సూట్‌కేసు అందించింది.

"థ్యాంక్సు !" అంటూ పెట్టె అందుకుని పట్టాలకు అడ్డంపడి ఎదురు ప్లాట్‌ఫారంమీద నిల్చొనివున్న ట్రైన్ దగ్గరకు వెళ్ళాడు.

విశ్వనాథం కళ్ళజోడు వ్యక్తికేసి చూశాడు. కళ్ళజోడు తీసి, ప్యాంటు జేబులో పెట్టుకున్నాడు. ఎంతో బరువును దించేసుకున్నవాడిలా నిట్టూర్పు విడవడాన్ని గమనించాడు విశ్వనాథం.

"మీరు విజయవాడలో దిగడంలేదా ?" విశ్వనాథం అడిగాడు.

"లేదు. గుంటూరు వెళ్తున్నాను." చిరునవ్వుతో సమాధానం ఇచ్చాడు.

విశ్వనాథానికి ఇతను తనతో ప్రయాణంచేసిన వ్యక్తేనా అని అనిపించింది. బండి కదలడానికి ఇంకా కొద్ది నిముషాలుంది. అంతలో ఇద్దరు పోలీసు ఇన్స్పెక్టర్లూ, నలుగురు జవాన్లూ, ఇద్దరు మఫ్టీలో వున్నవాళ్ళూ లోపలకు వచ్చారు.

విశ్వనాథం గాభరా పడ్డాడు. రెండో వ్యక్తి తాపీగా చూస్తూ కూర్చుని వున్నాడు.

విశ్వనాథం పెట్టె తెరిచి చూశారు.

'మీ సూట్‌కేసు కొంచెం చూపిస్తారా ?' కళ్ళజోడు తాలూకు వ్యక్తిని మఫ్టీలోవున్న అతను అడిగాడు.

"ఓ! ష్యూర్ !" అంటూ అతడు సూట్‌కేసు తీసి వాళ్ళముందు పెట్టాడు. తెరవడానికి ప్రయత్నించాడు. అతని దగ్గిరవున్న తాళంచెవి దానికి పట్టలేదు.

"సారీ ! కీ ఇంటిదగ్గిర మారుపడినట్టుంది. కావాలంటే తాళం పగలగొట్టి చూసుకోవచ్చు!" నిర్లక్ష్యంగా, 'నేనేం దొంగనా, హంతకుణ్ణా, భయపడటానికి' అన్న ధోరణిలో అన్నాడు.

ఒక జవాన్ పరుగెత్తుకెళ్ళి ఇనుపకడ్డీ ఒకటి పట్టుకొచ్చాడు.

తాళం పగిలింది.

పెట్టె తెరుచుకుంది.

విశ్వనాథం నోరు తెరిచాడు.

పెట్టె తాలుకు అతను ముఖంమీద కంకరరాయి తగిలినట్టు 'కెవ్వు' మన్నాడు.

పెట్టెలో గడ్డకట్టుకుపోయిన చిక్కటి రక్తం మొండెం నుంచి వేరుచేయబడ్డ చిన్న తలా, రెండు చిన్న చిన్న చేతులూ వున్నాయ్.

అతని చేతులకు బేడీలు తగిలించారు పోలీసులు. ఆ పెట్టెనూ, అతణ్ణీ తీసుకు వెళ్ళిపోయారు.

విశ్వనాథం చివ్వున లేచాడు. ఆ పెట్టెలో కూర్చోవాలంటే భయంగా వున్నది. బండి దిగాడు.

బుర్రలో ఏదో మెరుపులా మెరిసింది.

పరుగు పరుగున రెండో ప్లాట్‌ఫారంమీద వున్న బండిలోకి ఎక్కాడు. బండి కదలబోతున్నది. దొరికిన పెట్టెలో ఎక్కాడు. తలుపు దగ్గర నిల్చున్నాడు. బుష్‌కోటు వ్యక్తి విశ్వనాథం ఎక్కిన పెట్టెకు పక్క పెట్టె తలుపు దగ్గర నిల్చుని బయటికి వంగి వంగి చూస్తున్నాడు.

బండి ఆగగానే విశ్వనాథం బుష్‌కోటు వ్యక్తి వున్న పెట్టెలోకి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు.

బండి కృష్ణాబ్రిడ్జిమీదుగా పోతోంది. కిటికీలోనుంచి తల బయటికిపెట్టి ముందు పెట్టె కేసి చూస్తున్నాడు విశ్వనాథం.

పచ్చని చేలపైగా నిండు చంద్రుడు కన్పిస్తున్నాడు. కృష్ణవేణి తెల్లని వెన్నెల్లో జలకాలాడుతున్నది.

ముందు పెట్టెకేసి తదేకంగా చూస్తున్నాడు విశ్వనాథం.

బుష్‌కోటు వ్యక్తి సూట్‌కేసును నదిలోకి విసరడం కన్పించింది. తెల్లటి వెన్నెల్లో మెరుస్తూ, నీటిమీద ఓ క్షణం గుండ్రంగా తిరిగి మునిగిపోయింది.

కృష్ణా కెనాల్ స్టేషన్‌లో బండి ఆగి ఆగక ముందే దిగి ఆ బుష్‌కోటు వ్యక్తి పచ్చటి వరిచేలకు అడ్డంపడి మెల్లగా నింపాదిగా నడుస్తో వెళ్ళిపోతున్నాడు.

విశ్వనాథం అతన్నే చూస్తూ కళ్ళజోడు గురించి ఆలోచించసాగాడు.

ఆ పెట్టెలో ఏముందో !

ఆ కళ్ళజోడు వ్యక్తికే తెలియాలి !

బ్యాంకి దోపిడీ తాలూకు డబ్బు వుందేమో !

బుష్‌కోటు వ్యక్తి కనుమరుగైపోయాడు. విశ్వనాథం తల లోపలకు తీసుకుని రిలీఫ్‌గా నిట్టూర్పు విడిచాడు.

("జ్యోతి" దీపావళి ప్రత్యేక సంచిక 1978)